



నక్కపల్లి డిపోలో ఇసుక నిల్వలు

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

కూటమి పాలనలో రాష్ట్రంలో రామరాజ్యం



హోం మంత్రి అనిత

- మహిళలు, శాంతి భద్రతల రక్షణకు అధిక ప్రాధాన్యం
- హోం మంత్రిగా నా మార్క్ చూపిస్తా..
- 'పేట' అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ
- 'ఆంధ్రజ్యోతి'తో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

నక్కపల్లి, జూలై 6: **రానున్న ఐదేళ్లు ప్రజల అభీష్టం మేరకు పాలన సాగుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మహిళలు, శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఇటీవల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.**

కూటమితో రాష్ట్రంలో రామరాజ్యం

ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారు. పాలకులు, అధికారులు.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. ఐదేళ్లపాటు వ్యవస్థలన్నీ గాడితప్పాయి. ప్రజాస్వామ్యానికి పాతర వేశారు. ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం కూడా లేకుండా చేశారు. అందుకే ప్రజలంతా ఏరికోరి కూటమిని గెలిపించుకున్నారు. ఈ ఘనత రాష్ట్ర ప్రజలదే. రానున్న ఐదేళ్లు ప్రజల అభీష్టం మేరకు రాష్ట్రంలో రామరాజ్యం కొనసాగుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

శాంతి భద్రతలు, మహిళల రక్షణకే అధిక ప్రాధాన్యం

మా హయాంలో రాష్ట్రంలో మహిళలు, శాంతిభద్రతల రక్షణకే అధిక ప్రాధాన్యం ఉంటుంది. వైసీపీ పాలనలో ఎంతోమంది మహిళలపై అఘాయిత్యాలు జరిగాయి. ఇక రాష్ట్రంలో అటువంటి వాటికి అవకాశం లేకుండా చేస్తాం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశాం. మహిళలకు ఏ సమస్య వచ్చినా, మూడో కంటికి తెలియకుండా వారికి న్యాయం చేసేలా ఒక ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేస్తాం.

గంజాయి, డ్రగ్స్ రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తాం

గంజాయి, డ్రగ్స్ రవాణా, విక్రయాలను ఉక్కుపాదంతో అణచివేస్తాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమిస్తాం. ఈ కేసుల్లో అసలు దోషులకు వీలైనంత త్వరగా శిక్షలు పడేలా చర్యలు చేపడతాం. హోం మంత్రిగా సహచర మంత్రులు, శాసనసభ్యులను సమన్వయపరచుకుంటూ మా అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సూచనలతో ఉత్తమ పనితీరు కనబరిచేందుకు కృషి చేస్తాను. నా మార్కు చూపిస్తాను.

పేట అభివృద్ధి ఎంతో ముఖ్యం

ఇదే సమయంలో పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి కూడా నాకు ఎంతో ముఖ్యం. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తాను. ఇంటింటా మంచినీటి కొళాయిలు ఏర్పాటు, ఉద్దండపురం పైలట్ ప్రాజెక్టు పూర్తి, టూరిజం హబ్‌గా రేవుపోలవరాన్ని తీర్చిదిద్దడం, ప్రజలకు, పర్యావరణానికి హానిలేని పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి కల్పించడంపై దృష్టి పెడతాను. వారానికి 2, 3 రోజులు నా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందిస్తా. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఫిర్యాదుల బాక్స్‌ను కూడా ఏర్పాటు చేస్తా. ఈ జన్మకు కాదు కదా?. ఎన్ని జన్మలెత్తినా పాయకరావుపేట నియోజకవర్గం ... మిగతా 8వ పేజీలో

2 డిపోల్లో ఇసుక అమ్మకాలు

నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో టన్ను రూ.1,060, నక్కపల్లి డిపోలో రూ.1,250

- ఉచితంగా సరఫరాకు ప్రభుత్వ నిర్ణయం
- ఇసుక సరఫరాకు కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు
- రేపటి నుంచి సరఫరా

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ఇసుక ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. జిల్లాలోని రెండు డిపోల్లో ఇప్పటికే ఉన్న 65 వేల టన్నుల ఇసుకకు అధికారులు ధర నిర్ణయించారు. నర్సీపట్నం మండలంలోని గబ్బాడ డిపోలో టన్ను రూ.1,060కి, నక్కపల్లి డిపోలో టన్ను రూ.1,250కి విక్రయించనున్నారు. ఇందు కోసం కలెక్టర్ విజయకృష్ణన్ చైర్మన్‌గా జేసీ, ఎస్పీ, జిల్లా పంచాయతీ, ఇరిగేషన్, మైన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది.

రేపటి నుంచి ఇసుక సరఫరా

సోమవారం నుంచి ఉచితంగా ఇసుక విధానం అమలుచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఉదయం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఇసుక సరఫరాకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటుచేసి ధరలు నిర్ణయించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు ప్రక్రియ నిర్వహించాలని, ముందు వచ్చిన వారికి ముందు ఇసుక సరఫరా చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలు బట్టి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇసుక రవాణా కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదుల్లో ప్రస్తుతం ఉన్న రీచ్‌లకు అదనంగా కొత్త రీచ్‌లు గుర్తించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వర్చువల్‌గా పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ నర్సీపట్నం మండలంలోని గబ్బాడ, నక్కపల్లి డిపోల్లో ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రెండు డిపోల్లో 65 వేల టన్నుల నిల్వలు

నర్సీపట్నం మండలంలోని గబ్బాడ, నక్కపల్లి డిపోల్లో అందుబాటులో 65 వేల టన్నుల ఇసుక నిల్వలను కేవలం లోడింగ్, రవాణా ఖర్చులను తీసుకొని విక్రయించనున్నారు. నర్సీపట్నం మండలంలోని గబ్బాడ ఇసుక డిపోలో 40 వేల టన్నులు, నక్కపల్లిలో 25 వేల టన్నుల ఇసుక నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ముందుగా ఈ నిల్వలను సోమవారం నుంచి విక్రయించి తరువాత తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇసుక నిల్వలు జిల్లాలో డిపోలకు తరలించి నిల్వ చేయనున్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలకు పూర్తిగా ఉచితం

ఉచిత ఇసుక పాలసీ అమలులోకి రాగానే పేదల గృహ నిర్మాణాలకు స్థానికంగా ఎంపిక చేసిన శారదా, తాండవ నదీ పరివాహక ప్రాంతాల్లో నిర్దేశించిన పరిమితులకు లోబడి ఇసుక నిల్వలు ... మిగతా 8వ పేజీలో

ఇసుక డిపోల తనిఖీ

- నిరంతర నిఘా ఉండాలని అధికారులకు జేసీ ఆదేశం



నర్సీపట్నం మండలం గబ్బాడ ఇసుక డిపో వద్ద ఆర్డీవో, డీపీవోతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

నర్సీపట్నం, జూలై 6 : గబ్బాడ ఇసుక సోమవారం నుంచి అందుబాటులోకి వస్తుందని జాయింట్ కలెక్టర్ జాహ్నవి తెలిపారు. శనివారం నర్సీపట్నం మండలం గబ్బాడ ఇసుక నిల్వ కేంద్రాన్ని డీపీవో, ఆర్డీవో, పోలీస్, మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. గబ్బాడ ఇసుక నిల్వ కేంద్రంలో ఎంత పరిమాణంలో నిల్వలు ఉన్నాయో లెక్కలు తేల్చాలని అధికారులకు సూచించారు. గబ్బాడ ఇసుక డిపో వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటలు నిఘా పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, డీపీవో శిరీషారాణి, జిల్లా అదనపు ఎస్పీ విజయ భాస్కర్, డీఎస్పీ మోహన్ జలవనరుల శాఖ డీఎస్‌ఈ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి డిపో సందర్శన

నక్కపల్లి: నక్కపల్లి ఇసుక డిపోను శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ జాహ్నవి పరిశీలించారు. ఆమెతో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ విజయ్‌భాస్కర్, ఆర్డీవో జయరాం, డీపీవో శిరీషారాణి, ఆర్‌టీవో మనోహర్, మైన్స్ ఏడీ సుబ్బారాయుడు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరిటెండెంట్ శైలజారాణి బృందం ఇసుక డిపో నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం ఇసుక పరిమాణం ఎంత వుంటుందని జేసీ జాహ్నవి.. గనులశాఖ ఏడీని అడిగారు. పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ విభాగాలకు సంబంధించిన సిబ్బందితో నిరంతరం నిఘా వుంచాలని జేసీ ఆదేశించారు. పోలీస్ సిబ్బంది, వీఆర్వోలు, సెక్రటరీలు సహా ఇతర సిబ్బందిని నిఘాకు నియమించేటప్పుడు ఒకరినే కాకుండా, షిఫ్టుల వారీగా నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ అప్పన్న, డీటీ సత్యనారాయణ, తదితరులున్నారు.



హామీలన్నీ అమలు చేస్తాం

- విశాఖపట్నం- తిరుపతి ప్రత్యేక రైలుకు కృషి
- నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా..
- ప్రజలకు అందుబాటులో ఉంటా..
- కూటమి ఆత్మీయ సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేశ్‌ను సత్కరిస్తున్న కూటమి నేతలు

- వార్త 7వ పేజీలో..



రహదారి భద్రతపై అవగాహన

అనకాపల్లిలో హెల్మెట్ ధరించిన వారిని గులాబీ పువ్వుతో అభినందిస్తున్న సీఐ పైడపునాయుడు

రహదారి భద్రతపై వాహనచోదకులకు అవగాహన కల్పిస్తూ అనకాపల్లిలో పోలీసులు శనివారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడుపుతున్న వారికి గులాబీ పువ్వు ఇచ్చి అభినందించారు. హెల్మెట్ ధరించని వారికి అవగాహన కల్పించారు. - వార్త 7వ పేజీలో..

వేధిస్తున్నాడని జైలుకు పంపితే..

బెయిల్‌పై వచ్చి చంపేశాడు



నిందితుడు సురేశ్ (ఫైల్)

రాంబిల్లి మండలంలో బాలిక దారుణ హత్య

- స్కూల్‌కు వెళ్లేదారిలో ఆమెకు తీవ్ర వేధింపులు
- ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదుతో అతడిని అరెస్టుచేసి జైలుకు పంపిన పోలీసులు
- పదిరోజుల క్రితం బెయిల్‌పై బయటకు..
- ఇంట్లోకి చొరబడి కత్తితో నరికి ఘాతుకం

రాంబిల్లి, జూలై 6: **బాలికపై వేధింపులకు పాల్పడుతున్నాడని అతడిని జైలుకు పంపితే బెయిల్‌పై బయటకు వచ్చి ఘాతుకానికి పాల్పడ్డాడు. అన్నెంపున్నెం ఎరుగని ఆ బాలికను అతి దారుణంగా హత్యచేశాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం రాంబిల్లి మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...**

హత్యకు గురైన బాలికది రాంబిల్లి మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామం. గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన రాంబిల్లి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళుతున్న ఆమెను కశింకోటకు చెందిన సురేశ్ వెంటాడి వేధిస్తుండేవాడు. అతడి అమ్మమ్మ, తాత కొప్పుగుండుపాలెంలో ఉంటున్నారు. తరచూ గ్రామానికి వస్తుండేవాడు. సురేశ్ వ్యవహారం తెలిసి బాలిక తల్లిదండ్రులు రెండు నెలల క్రితం రాంబిల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సురేశ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. సుమారు పది రోజుల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చాడు. రోజూ మాదిరిగానే శనివారం పాఠశాలకు వెళ్లిన బాలిక సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకుంది. ఆ సమయానికి తల్లిదండ్రులు ఇంకా ఇంటికి రాలేదు. నాయనమ్మ ఉన్నప్పటికీ బయటకు వెళ్లింది. దీంతో ఆమె పుస్తకాల బ్యాగ్ బయట ఉన్న టేబుల్‌పై పెట్టి స్నానం చేసేందుకు ఇంట్లోకి వెళ్లింది. అయితే అప్పటికే సురేశ్ లోపల మాటు వేసి ఉన్నాడు. ఆమె ఇంట్లోకి వెళ్లగానే సురేశ్ తలుపులు వేసి ఆమెను కత్తితో అతి దారుణంగా హత్య చేశాడు. ఈలోగా బాలిక నాయనమ్మ ఇంటికి వచ్చింది. తలుపులు వేసి ఉండడంతో వాటిని తట్టింది. లోపల ఉన్న సురేశ్ తలుపు తీసి ఆమెను తోసేసి పారిపోయాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లిన ఆమె మనుమరాలు రక్తపు మడుగులో విగతజీవిలా మనవరాలు పడి ఉండడాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసింది. సమాచారం అందుకున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, రాంబిల్లి, అచ్యుతాపురం ... మిగతా 8వ పేజీలో

గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలపై విచారణ

- డిప్యూటీ డీఈవోలకు ఆదేశం
- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ



జడ్పీహెచ్‌ఎస్ మెయిన్ స్కూల్‌ను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నర్సీపట్నం, జూలై 6: జిల్లాలో గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలపై విచారణకు డిప్యూటీ డీఈవోని ఆదేశించామని జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శనివారం చెట్టుపల్లి, పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం నర్సీపట్నం ఐదు రోడ్ల కూడలిలోని జెడ్పీహెచ్ స్కూల్‌లో జరుగుతున్న టీచ్ టూల్ అబ్జర్వేషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో త్రిసభ్య కమిటీలు వేసి 37 గుర్తింపు లేని ప్రైవేటు స్కూళ్లను గుర్తించామని తెలిపారు. ఈ పాఠశాలలు 2022 నుంచి రెన్యువల్ చేయించు కోలేదని, దీని మీద డిప్యూటీ డీఈవోతో విచారణ చేయిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంచడానికి టీచ్ టూల్ అబ్జర్వేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండో విడత నాడు- నేడు పనులు జరుగుతున్నాయని, హెచ్‌ఎంల వద్ద డబ్బులు నిల్వ ఉన్నంత వరకు పనులు చేస్తున్నారని తెలిపారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా 2,300 మంది బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించినట్టు ఆమె చెప్పారు.

పేటలో ఉపాధి నిధులు హాంఫట్

సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన వీఆర్పీల అవకతవకలు

- నామవరం, ఈదటం గ్రామాల్లో రూ.లక్షలు స్వాహా అయినట్టు గ్రామసభల్లో వెల్లడి
- ఉపాధి పనుల్లో అక్రమాలు జరుగుతుంటే చర్యలు తీసుకోరా? అని ప్రశ్నించిన శ్రీరాంపురం సర్పంచ్
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిపై పీడీ ఆగ్రహం



అధికారులను నిలదీస్తున్న శ్రీరాంపురం సర్పంచ్ జి.కృష్ణప్రసాద్

పాయకరావుపేట, జూలై 6:

గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో పలు గ్రామాల్లో ఉపాధి నిధులు గోల్‌మాల్ అయినట్టు సామాజిక తనిఖీల్లో బయట పడింది. ముఖ్యంగా మండలంలో నామవరం, ఈదటం పంచాయతీల్లో రూ.లక్షల్లో ఉపాధి నిధులను వీఆర్పీలు పక్కదారిపట్టించినట్టు సామాజిక తనిఖీ సిబ్బంది ప్రకటించగా, శనివారం పాయకరావుపేటలో జరిగిన ప్రజావేదికలో పాల్గొన్న పలువురు నాయకులు, గ్రామస్థులు ఆయా గ్రామాల వీఆర్పీలపై ఫిర్యాదులు చేశారు. దీంతో ప్రజావేదిక వాడివేడిగా సాగింది. పాయకరావుపేట మండలంలోని 24 పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.8,23,04,118ల ఖర్చుతో చేపట్టిన మొత్తం 1,254 పనులకు సంబంధించి ఇటీవల గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన బినామీ మస్తర్లు, పనులు చేసిన వారికి కాకుండా ఇతరుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ, హౌసింగ్‌లో అవకతవకలపై ఆయా పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించిన సామాజిక తనిఖీ సిబ్బంది శనివారం పాయకరావుపేటలో డ్వామా పీడీ ఇ.సందీప్ ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా డీఆర్పీలు నివేదికలు చదివి వినిపించగా సామాజిక తనిఖీల్లో గుర్తించిన అవకతవకలపై వీఆర్పీలను పీడీ నిలదీశారు. మండలంలో నామవరం, ఈదటం పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల్లో అధికంగా తేడాలు బయటపడి అధిక మొత్తంలో నిధులు స్వాహా అయినట్టు సామాజిక తనిఖీ సిబ్బంది ప్రకటించగా, ప్రజావేదికకు హాజరైన ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

విద్యుదాఘాతంతో గిరిజన యువకుడి మృతి



బైసన్ మృతదేహం

చింతపల్లి, జూలై 6: గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ సిరిబాల గ్రామంలో ఓ గిరిజన యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం సిరిబాల గ్రామానికి చెందిన జోరంగి బైసన్(27) విద్యుత్ స్తంభంపై వీధి లైట్ ఏర్పాటు చేసేందుకు అల్యూమినియం నిచ్చెన ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తగలడం వల్ల అతను విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్వీనగర్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు వెంటనే చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేస్తుండగా అప్పటికే యువకుడు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు.

ఎం.కోడూరులో తాపీమేస్త్రీ మృతి



నాగేశ్వరరావు మృతదేహం

మాడుగుల, జూలై 6: విద్యుదాఘాతానికి గురై ఓ తాపీమేస్త్రీ మృతిచెందిన సంఘటన మాడుగులలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. ఎం.కోడూరు గ్రామానికి చెందిన బిక్కవోలు నాగేశ్వరరావు(33) మాడుగులలో తాపీమేస్త్రిగా పనికి వచ్చాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కి గురయ్యాడు. వెంటనే సహచర కూలీలు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

కృష్ణాదేవిపేట, జూలై 6: గంజాయి రవాణా కేసులో ఏడేళ్ల నుంచి పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు జడ్డు నాగరాజు ఎట్టకేలకు పట్టుబడినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. 2017వ సంవత్సరంలో 106 కిలోల గంజాయి రవాణాలో వాహనాలతో ఎనిమిది మందిని పట్టుబడగా అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ గ్రామానికి చెందిన జడ్డు నాగరాజు(50) అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. ఎట్టకేలకు శనివారం అదుపులో తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పట్టుబడి నాగరాజుపై కేసు నమోదు చేసి కోర్టు ఆదేశాల మేరకు విశాఖపట్నం సెంటర్ జైలుకు రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. గిరిజన, మైదాన ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి ఆచూకీ తెలిస్తే ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ కోరారు.

కారు ఢీకొని మహిళ మృతి

కొత్తూరు, జూలై 6: అనకాపల్లి మండలం శంకరం గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న మహిళను అనకాపల్లి నుంచి పెందుర్తి వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన యల్లపు నాగమణి (50) అక్కడికక్కడే మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఈ విషయమై రూరల్ పోలీసులకు వారు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారును చేధించేందుకు రూరల్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరహానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎస్.రాయవరం, జూలై 6: మండలంలోని సోముదేవుపల్లి సమీపంలో గల వరహానదిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ విభీషణరావు శనివారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తి ఎవరన్నది వివరాలు తెలియరాలేదని, మృతుడు ఎరుపు రంగు చొక్కా, డార్క్ రంగు షార్ట్ వేసుకొని ఉన్నాడన్నారు. జుట్టు, గెడ్డం కూడా పొడవుగా ఉందని, ఇంతకి మించి ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. కేసు నమోదుచేసి, మృతదేహాన్ని నక్కపల్లి మార్చ్యూరీలో భద్రపరిచామని, మృతి చెందిన వ్యక్తి సమాచారం ఎవరికైన తెలిస్తే 9440796107 సంప్రదించాలని ఆయన కోరారు.

ఎరువుల దుకాణంలో ప్రత్యేక బృందాల తనిఖీలు

ఎస్.రాయవరం, జూలై 6: మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న వీరభద్ర ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో వ్యవసాయ, విజిలెన్స్ శాఖల అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏర్పాటైన జిల్లా స్పెషల్ టీం సభ్యులు రంపచోడవరం ఏడీఏ సీసీహెచ్ చౌదరి, విశాఖపట్నం ఐవోబీ ఎ. రవిప్రసాద్ ఎరువులు, పురుగులమందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దుకాణంలో ఉన్న స్టాక్ రిజిస్టర్‌లో చిన్న చిన్న తప్పులను గుర్తించిన అధికారులు వాటిని సవరించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందుల నిల్వలకు సంబంధించి దుకాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడమే కాకుండా ఎంఆర్‌పీ ధరలకు మించి విక్రయించకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యసాయాధికారిణిలు సౌజన్య, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో పెరిగిన విమానాల సంఖ్య

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే విమానాల సంఖ్య జూన్ నెలలో కాసింత పెరిగింది. గత ఏడాది జూన్‌లో 1,692 విమానాలు రాకపోకలు సాగించగా, ఈ ఏడాది జూన్‌లో వాటి నాల సంఖ్య 1,704కు పెరిగింది. అయితే విమాన ప్రయాణికుల సంఖ్య స్వల్పంగా తగ్గింది కిందిటేడాది జూన్‌లో 2,54,490 మంది ప్రయాణించగా, ఈ జూన్‌లో 2,32,149 మంది ప్రయాణం చేశారని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నరేశ్‌కుమార్, కుమార్ రాజా, డీఎస్ వర్మలు తెలిపారు. డిజి యాత్ర విధానం అమలు వల్ల విమాన ప్రయాణికులు చాలా త్వరగా క్లియరెన్స్ తీసుకొని కేటాయించిన లాంజ్‌లోకి వెళ్లగలుగుతున్నారని వివరించారు. చెకిన్ టైమ్‌ని ఇది బాగా తగ్గిస్తున్నదని పేర్కొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా రవీంద్ర బాధ్యతల స్వీకారం

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా వి.రవీంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కమిషనర్ పోస్టు ఖాళీ కావడంతో కొత్త వారిని నియమించే వరకూ పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం ఆ ఛాంబర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సెక్రటరీ కీర్తి, చీఫ్ ఇంజినీర్ భవానీ శంకర్, ఎస్ఈ బలరామునాయుడు, సీఏఓ హరిప్రసాద్, డీఎఫ్ఓ శాంతిస్వరూప్ తదితరులు ఆయన్ను కలిసి అభినందించారు. అన్ని విభాగాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రమేశ్‌పై దాడి ఘటనలో సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలి

» నిర్మాత, టీడీపీ నేత నట్టికుమార్ డిమాండ్



చోడవరం, జూలై 6: ఎన్నికల సమయంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వగ్రామం తారువలో సీఎం రమేశ్‌పై జరిగిన దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ స్వామినాయుడు, దేవరాపల్లి ఎస్ఐ నాగేంద్రలపై చర్యలు చేపట్టాలని సినీ నిర్మాత, టీడీపీ నేత నట్టికుమార్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఘటన జరిగిన రోజున ఎస్ఐ, సీఐలు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు. నాడు పోలీసుల తీరుపై ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, అయినా ఆ ఇద్దరు అధికారులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేకపోవడం సరికాదని, తక్షణం ఆ ఇద్దరు పోలీసు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

అధ్వానంగా అనకపల్లి-లంకెలపాలెం రోడ్డు

» ప్రయాణం నరకం
» వర్షాలతో ప్రయాణికులకు తప్పని తిప్పలు
» భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం
» పట్టించుకోని అధికారులు

దారి పొడవునా గోతులు



ఎరుకునాయుడుపాలెం సమీపంలో భారీ గోతులు పడిన దృశ్యం

సబ్బవరం, జూలై 6: మండలంలోని అనకపల్లి-లంకెలపాలెం రహదా రిపై ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. రోడ్డుపై పలుచోట్ల భారీ గోతులు ఏర్పడడంతో పరిస్థితి దారుణంగా మారింది. ఇటీవల వర్షాలకు రోడ్లు పలు చోట్ల ధ్వంసమవడంతో వాహన చోదకుల అవస్థలు వర్ణణాతీతం. ముఖ్యంగా అనకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడఅగ్రహారం, పెదముషిడివాడ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో వాహన చోదకులకు కష్టాలు రెట్టింపు అయ్యాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి నరకం చూస్తున్నారు. తరచూ ప్రమాదాలు సంభవించి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత మూడేళ్లుగా జాతీయ రహదారి నిర్మాణంలో ల్యాండ్ ఫిల్లింగ్ కోసం ఫార్మాసిటీ, ఎన్టీపీసీ నుంచి వ్యర్థ పదార్థాలు, ఫ్లయాష్ బూడిదను భారీ వాహనాలు పరిమితికి మించి లోడుతో వెళుతుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఫార్మా వ్యర్థాలు పడిపోతుండడంతో ప్రజలు కాలుష్య బారిన పడుతున్నారు. ఇదే విషయమై పలు సార్లు పైడివాడఅగ్రహారం వద్ద స్థానికులు లారీలు నిలిపేసి నిరసన వ్యక్తం చేసినా ప్రయోజనం లేకపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. రోజూ వందల సంఖ్యలో భారీ



పైడివాడఅగ్రహారం వద్ద రోడ్డు దుస్థితి



అసకపల్లి వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు

రాకపోకలు సాగిస్తుండడం రోడ్డు ధ్వంసం కావడానికి కారణమని గుర్తించినా అధికారులు వాహనాలను నిరోధించలేకపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. మరో పక్కన ఫ్లైయాష్ గాల్లో ఎగరడం వలన ఇళ్లలో ఉండలేకపోతున్నామని, అనకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల ప్రజల వాపోతున్నారు. రోడ్డుపై గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవడమే కాకుండా, మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చలనం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి కనీసం గోతులైనా పూడ్చాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే ఎన్టీపీసీ నుంచి వచ్చే భారీ వాహనాలను అనకాపల్లి మీదుగా సబ్బవరానికి మళ్లించాలని కోరుతున్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి

» విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ విజయభాస్కర్



మాట్లాడుతున్న విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ విజయభాస్కర్

చోడవరం, జూలై 6: విద్యార్థులను కొట్టడం, తిట్టడం చేయకుండా వారిని గౌరవంగా చూస్తూ వారిలో దాగిఉన్న నైపుణ్యాలు వెలికితీసేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ విజయభాస్కర్ సూచించారు. స్థానిక కొత్తూరు బాలికల హైస్కూల్‌లో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్‌టు టూల్ శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విషయంలో అనుసరించవలసిన విధానాల గురించి వివరించారు. విద్యార్థుల పాస్, ఫెయిల్‌తో సంబంధం లేకుండా, వారి స్థాయిని బట్టి బోధన చేయాలని, విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే నేర్పును ఉపాధ్యాయులు అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షా కోర్సు డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి, ఎంఈవోలు ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలం సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ రమేశ్, బీజేపీ నాయకులు

అనకాపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అఖండ భారతావని కోసం ప్రాణాలర్పించిన జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనకాపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి సేవలను ఎంపీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, కె.సరేంద్ర మోహన్, పరుచూరి భాస్కరరావు, వెన్నా శ్రీరామ్మూర్తి, సీఎం రాజేశ్, రిత్విక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నింటినీ అమలు చేస్తాం

» కార్యకర్తలకు న్యాయం చేస్తా » కూటమి ఆత్మీయ సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

కొత్తూరు, జూలై 6 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. శనివారం అనకాపల్లి పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు, నాయకులతో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ కాపు కమ్యూనిటీ నిమిత్తం రెండు ఎకరాల స్థలం ఇస్తే వైసీపీ పార్టీ కార్యాలయాన్ని నిర్మించడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో కష్టపడిన కార్యకర్తలు, నాయకులందరికీ న్యాయం చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. విశాఖపట్నం నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అయోధ్య రామమందిరం చూపిస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తానన్నారు. పార్లమెంటు సమావేశాల్లో తప్ప ప్రతి రోజూ అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ చరిత్ర చూడలేని విజయాన్ని ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. పోటీ చేసిన వ్యక్తుల్లో 93 శాతం విజయం సాధించారంటే ప్రజలు ఎంత కసిగా ఓటు వేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్రం నుంచి నిధులు రావాలన్నా, ప్రాజెక్టులు ఏపీ నిర్మాణాలు చేపట్టాలన్నా సీఎం రమేశ్ వల్లే సాధ్యమన్నారు. టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు 75శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ నరకాసురుడు గురించి ఎలా అయితే విన్నామో.. జగనాసురుని కోసం గత ఐదేళ్లలో వినడమే కాకుండా చూశామన్నారు. ఈ ఐదేళ్లలో దేశంలో ఉన్న భూములను ఎక్కడ దోచేస్తాడో అనే ఆందోళనతో ఇతర దేశాల నుంచి ప్రజల ఆస్తులను కాపాడుకునేందుకు ఎన్నికల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వైసీపీని ఓడించేందుకు ఓటు వేశారన్నారు. అంత దుర్మార్గమైన పాలన జగనాసురుడు చేశాడని ఆరోపించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీ సీఎం రమేశ్‌కు కూటమి నేతలు పూలమాల వేసి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

» వాహనచోదకులకు అవగాహన

అనకాపల్లి టౌన్, జూలై 6: పట్టణంలో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పట్టణ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.పైడపు నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది శనివారం స్థానిక నెహ్రూచౌక్, రింగురోడ్డు జంక్షన్‌ల వద్ద రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ పువ్వులు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడపునాయుడు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్‌ను ధరించి ప్రయాణం చేయాలన్నారు. ముఖ్యంగా యువత ద్విచక్రవాహనాలను నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడపడరాదని సూచించారు.

కుటుంబ యజమాని, యువత, విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపికలు

ఎలమంచిలి, జూలై 6: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపికలు జరుగుతాయని హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కొఠారు నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో జరగబోవు అంతర్ జిల్లాల హాకీ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారిణిలు 2008 సంవత్సరం తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు.

హోం మంత్రిని కలిసిన కలెక్టర్



కలెక్టర్ విజయకృష్ణన్‌తో చర్చిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, జూలై 6: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను శనివారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ నక్కపల్లి సమీపంలో వున్న హోం మంత్రి అనిత నివాసానికి వచ్చారు. హోంమంత్రికి జిల్లా కలెక్టర్ పూలమొక్కలను అందజేసి, శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్ఏవోబీ, ఏపీఐఐసీ కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి హోం మంత్రి అనిత తీసుకువచ్చారు. మత్స్యకారులు, రైతులకు న్యాయం చేయాలని, అంకితభావంతో పనిచేసి జిల్లాను తీర్చిదిద్దాలన్నారు. వారి వెంట నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు, మత్స్యకార నాయకులు వున్నారు.

అప్పన్న కొండకు కూటమి నేతల పాదయాత్ర



కొండకు పాదయాత్రగా బయల్దేరిన వారితో పంచకర్ల రమేష్, గండి బాబ్జీ

సబ్బవరం, జూలై 6 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే సింహాచలం అప్పన్న కొండకు పాదయాత్రగా వస్తానని బంగారమ్మపాలెం సర్పంచ్ దాడి లావణ్య ఎన్నికలు ముందు మొక్కుకున్నారు. ఆ ప్రకారం విజయం సాధించడంతో శనివారం పాదయాత్ర చేపట్టారు. తొలుత పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ స్థానిక సోమలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. నాయకులు దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాశ్, దొడ్డి రాజుకోటి, ఇందలి రమణ, సాలాపు వెంకటేశ్వరరావు, బీఏ రావు తదితరులు పాల్గొన్నారు.

మోటూరుపాలెంలో అదుపులోకి అతిసార



బ్లీచింగ్ చల్లుతున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం, జూలై 6: దిబ్బపాలెం పంచాయతీ మోటూరుపాలెంలో డయేరియా అదుపులోకి వచ్చిందని వైద్యాధికారులు తెలిపారు. గత మంగళవారం తొమ్మిది మందితో ప్రారంభమైన డయేరియా కేసులు శుక్రవారం నాటికి 18కి పెరిగాయి. అయితే స్థానిక వైద్యబృందం తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో శనివారం రాత్రికి విశాఖ కేజీహెచ్‌లో ఐదుగురు, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో ముగ్గురు, అచ్యుతాపురం ఆసుపత్రిలో నలుగురు మాత్రమే చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు ఆరోగ్యంతో ఇళ్లకు వెళ్లిపోయారు. శనివారం ఉదయం కూడా తహసీల్దార్ సరోజిని, ఎంపీడీఓ సురేష్ కుమార్ వైద్య బృందంతో కలిసి గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యపనులు చేపట్టారు. బ్లీచింగ్ చల్లడంతోపాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కొత్త కేసులేమీ లేవని అచ్యుతాపురం పీహెచ్‌సీ సీహెచ్‌ఓ వేణుగోపాల్ తెలిపారు.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

ప్రజల రుణం తీర్చుకోలేను.

పిల్లలను బాగా చదివించండి

పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చామనేదానికంటే, ఎంత బాగా చదివించామనే అంశానికే తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత కాలంలో పిల్లలు చదువుకోవడానికి ఎటువంటి ఇబ్బందులు వుండవు. మా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తూ, సహకారమందిస్తుంది. ఇదే సమయంలో యువత డ్రగ్స్ చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు సున్నితంగా ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ వుండాలి. ఒకసారి డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే ఎంత చదువుకున్నా వారి జీవితం నాశనమవుతుంది.

బెయిల్‌పై వచ్చి చంపేశాడు

... 5వ పేజీ తరువాయి

సీఐలు నరసింగరావు, బుచ్చిరాజు సిబ్బందితో వచ్చి బాలిక మృతదేహాన్ని పరిశీలించి, విచారణ జరిపారు. క్లూస్ టీమ్ చేరుకుని వేలిముద్రలను సేకరించింది. సురేశ్‌పై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు.

పేటలో ఉపాధి నిధులు హాంఫట్

... 5వ పేజీ తరువాయి

ఆయా పంచాయతీల నాయకులు, గ్రామస్థులు మాట్లాడుతూ తమ పంచాయతీల్లో వీఆర్పీలు చేసిన అవకతవకలను డ్వామా పీడీకి వివరించారు. వీరిని విధుల నుంచి తొలగించడంతోపాటు స్వాహాచేసిన నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సందీప్ మాట్లాడుతూ నామవరం, ఈదటం వీఆర్పీలపై పూర్తిస్థాయి విచారణచేసి స్వాహా చేసిన నిధులు రికవరీ చేయడంతోపాటు వీరిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా ప్రజావేదికకు నామవరం వీఆర్పీ హాజరుకాకపోవడం పట్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవీఓ సీహెచ్.నిర్మలాదేవి, డీపీఎం పీవీ.రమణ, ఏపీడీ పీవీ.ఎరకయ్య, ఎంపీడీఓ కె.స్వప్న, మండల టీడీపీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వైసీపీ నాయకుడు ఇసరపు తాతారావు, టీడీపీ నాయకులు కురందాసు శివ, గొర్ల లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు జరుగుతుంటే చర్యలు తీసుకోరా?

పాయకరావుపేటలో జరిగిన ప్రజావేదికలో శ్రీరాంపురం పంచాయతీలో జరిగిన అవకతవకలపై చర్చ జరుగుతున్న సమయంలో పంచాయతీ సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతుంటే అధికారులు చర్యలు తీసుకోరా? అని ప్రశ్నించారు. శ్రీరాంపురం పంచాయతీలో గతంలో నిధులు స్వాహా చేసినట్టు నిర్ధారించి విధుల నుంచి తొలగించిన వీఆర్పీతో తిరిగి పంచాయతీలో ఉపాధి పనులు ఎలా చేయిస్తున్నారని, అదేవిధంగా అతడి నుంచి ఇప్పటి వరకు సొమ్ము ఎందుకు రికవరీ చేయలేకపోయారని నిలదీశారు. ఆయనతోపాటు నాయకులు బత్తిన నాగేశ్వరరావు తదితరులు కూడా అధికారులను నిలదీశారు. దీనిపై స్పందించిన డ్వామా పీడీ.. స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వహించకుండా చేసిన పనికిమాలిన పనులకు ప్రజల నుంచి తాము మాటలు పడాల్సి వస్తోందన్నారు. ఉద్యోగాల్లో ఉండాలనుకుంటే నిబంధనల ప్రకారం పనిచేయాలని పీడీ హెచ్చరించారు.

2 డిపోల్లో ఇసుక అమ్మకాలు

... 5వ పేజీ తరువాయి

సేకరణకు అనుమతులు ఇవ్వనున్నారు. దీంతో శారదా, తాండవ నదీ పరివాహక ప్రాంతాల్లో పేదల గృహాల నిర్మాణాలకు ఇసుక ఉచితంగా పొందే అవకాశం ఉంటుంది. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో స్థానిక అవసరాలకు అందుబాటులో వున్న నదుల్లో ఇసుక సేకరణకు పరిమిత అనుమతులు జారీ చేయనున్నారు. ఇసుక సేకరణ ఏయే ప్రాంతాల్లో చేయవచ్చనేదానిపై కమిటీ వివరాలను సేకరిస్తోంది. ఎంపిక చేసిన నదీపరివాహక ప్రాంతాల నుంచి స్థానిక అవసరాలకు కేవలం లోడింగ్, రవాణా చార్జీలు పెట్టుకుంటే ఇసుక పొందే అవకాశం ఉంటుంది. స్థానిక వీఆర్‌వో గృహ నిర్మాణదారులకు అవసరమైన ఇసుక నిల్వలు పొందేందుకు అనుమతులు జారీ చేయనున్నారు. గతంలో ట్రైరు బండి ఇసుక రూ.700 వరకు చెల్లించాల్సి వచ్చేది. దూరాన్ని బట్టి రూ.1500 వరకు ధర పలికేది. ఉచిత ఇసుక పాలసీ అమలుతో ఇసుక లోడింగ్‌కు టన్నుకు రూ.30 మాత్రమే చెల్లించేలా ధర నిర్ణయించారు. రవాణా ఖర్చులు లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. ట్రైరు బండి ఇసుక కేవలం రూ.500 ధర లోపే ఇంటికి చేరే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉచిత ఇసుక విధానం అమలుపై జిల్లా గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు మాట్లాడుతూ ఉచిత ఇసుక పంపిణీ అమలుకు అన్ని మండలాల్లో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నెల రోజుల వరకు డిపోల్లో ఇసుక ఆఫ్‌లైన్‌లోనే చెల్లింపులు జరుగుతాయన్నారు. డిపోల్లో ఇసుక నిల్వలు తరలిపోకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నెల రోజుల తరువాత ఆన్‌లైన్ బుకింగ్ విధానం అమలులోకి వస్తుందని చెప్పారు.

'ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి'

పరవాడ, జూలై 6 : ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించాలని తహసీల్దార్ ఎస్.గణపతిరావు రాంకీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఆయన యాజమాన్యానికి లిఖితపూర్వకంగా లేఖరాశారు. ఫార్మా కాలుష్యం కారణంగా ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో ఇటీవల భారీ ఎత్తున చేపలు మృత్యువాతపడిన సంగతి తెలిసిందే. దీంతో మత్స్యకారులు ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు తహసీల్దార్ రాంకీ యాజమాన్యానికి లేఖ ద్వారా మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు.

పంచాయతీల్లో సర్పంచులే సుప్రీం

- వారి ఆధ్వర్యంలోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి
- అచ్యుతాపురం మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్ ఆదేశం
- చోడపల్లిలో భూమి లేకుండానే ఇళ్ల పట్టాలు ఇవ్వడంపై ఆగ్రహం
- గ్రామాల్లో సమస్యలను ప్రస్తావించిన పలువురు సభ్యులు



సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూలై 6 : గ్రామాల్లో సర్పంచులే సుప్రీం అని, పంచాయతీల పరిధిలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరిగినా వారి ఆధ్వర్యంలోనే చేపట్టాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలన్నారు. సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం పంచాయతీ)లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నాయని సెజ్ కర్మాగారాల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎక్కువగా ఇక్కడ ఉండడం వల్ల గంజాయి అధికంగా ఉందని ఎంపీటీసీ సభ్యులు నీరుకొండ నర్సింగరావు, లాలం శ్రీను, అడిగర్ల శ్రీను వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సెజ్ పునరావాస కాలనీలో చాలా సమస్యలున్నాయని, ముందుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. అచ్యుతాపురం మండలంలోనే గంజాయి విక్రయాలు అధికంగా జరుగుతున్నాయని తెలిసిందని, పోలీసులు వెంటనే స్పందించాలని ఆయన ఆదేశించారు. జగనన్న కాలనీలో ఉమ్మడి చోడపల్లి పంచాయతీకి చెందిన 90 మందికి పట్టాలు ఇచ్చినా, ఇంతవరకు స్థలాలు చూపించలేదని చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను అన్నారు. స్థలం లేకుండా పట్టాలెలా ఇచ్చారని ఎమ్మెల్యే గృహ నిర్మాణ శాఖ అధికారులన ప్రశ్నించారు. తహసీల్దార్ పట్టాలిచ్చిన తర్వాతే తాము అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని, చోడపల్లి పంచాయతీ పరిధిలో స్థలం లేదని హౌసింగ్ అధికారులు వివరించారు. దీంతో ఇదెలా సాధ్యమని ఎమ్మెల్యే నివ్వెరపోయారు. అలాగే హౌసింగ్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 34 పంచాయతీల్లో సుమారు 400 గృహాల నిర్మాణం ఇంకా ప్రారంభించలేదని హౌసింగ్ అధికారులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ధనికులు, వారి బంధువులకే ఇళ్ల స్థలాలు కేటాయించారని సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు ఆరోపించారు. దిబ్బపాలెం పంచాయతీలో మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడం వల్లే పంచాయతీ పరిధిలో గల మోటూరు పాలెంలో డయేరియా విజృంభించిందని సర్పంచ్ శాంతి కుమారి తెలిపారు. అనంతరం మరికొంత మంది సభ్యులు తమ పంచాయతీల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా మండల సమావేశానికి వచ్చిన విజయకుమార్‌ను సభ్యులు పూలమాలలతో సత్కరించారు.

సమావేశం ప్రారంభానికి ముందు ఎంపీడీవో మాట్లాడుతూ సభ్యులు మాత్రమే సభలో ఉండాలని, కానివారు బయటకు వెళ్లిపోవాలని సూచించారు. సమావేశం ప్రారంభమైన తర్వాత కూడా ఎంపీపీ భర్త కోన లచ్చం నాయుడు ఉండడంతో మీరెందుకు ఉన్నారని ఎమ్మెల్యే విజయకుమార్ ఆయనను ప్రశ్నించారు. ఎంపీపీకి అడ్వయిజర్‌గా ఉన్నానని లచ్చంనాయుడు సమాధానం ఇచ్చినా.. వెళ్లిపోవాలని ఎమ్మెల్యే అనడంతో ఆయన బయటకు వెళ్లిపోయారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సరోజిని, ఎంపీడీవో సురేష్ కుమార్, జడ్పీటీసీ లాలం రాంబాబు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్‌తో పాటు ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించండి

- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తరాదు
- ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో పీలా

అనకాపల్లి టౌన్, జూలై 6 : పట్టణంలోని అగ్గిమర్రిచెట్టు వద్ద గల జగన్నాథస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ శనివారం ప్రమాణం స్వీకారం చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో కమిటీ చైర్మన్‌గా దాడి బుజ్జి, డైరెక్టర్లుగా బొండా రమేష్, అనకాపల్లి మోహనరావు, బొడ్డేడ వెంకట చలపతిరావు, కాండ్రేగుల వెంకట వీరఅప్పారావు, బుగత కోటేశ్వరరావు, యల్లమల్లి ధనలక్ష్మి, బుద్ద లక్ష్మీఅప్పారావు, శరగడం కృష్ణలతో ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రథయాత్రను ఘనంగా నిర్వహించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో కొణతాల, పీలా పర్యటన

తుమ్మపాల : అనకాపల్లి మండలం తుమ్మపాలలోఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలు శనివారం పర్యటించారు. గవరపేటవీధిలో గల అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, కేంద్రానికి అందుతున్న వనరులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుమ్మపాల పీహెచ్‌సీ సిబ్బంది చేపట్టిన అతిసార వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. స్థానిక నాయకులు సందిన సునీల్, చదరం నాగేశ్వరరావు, పీలా విశ్వేశ్వరరావు, కర్రి బాబి, బొడ్డపాటి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : ఇక్కడ జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను మూగ, చెవిటి యూనియన్ సభ్యులు శనివారం సత్కరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛను రూ.మూడు వేల నుంచి రూ.6వేలు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



అనకాపల్లి అరుంధతినగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బుద్ద తదితరుల నివాళి



కశింకోట జాషువా కాలనీలో....



పాయకరావుపేట పట్టణంలో...



కోటవురట్ల మండలం కైలాసపట్నం...



పాయకరావుపేట మండలం అరట్లకోటలో..

అనకాపల్లి టౌన్, జూలై 6 : స్వాతంత్ర్య సమరయోధులు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌కు వర్ధంతిని శనివారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం బస్టాప్ వద్ద గల ఆయన విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంగరాజు, బొడ్డేడ అప్పారావు, ప్రవీణ్, చిన్నియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అరుంధతినగర్‌లో ఆయన విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మళ్ల శివనారాయణ, విల్లూరి రమణబాబు, దొడ్డి జగదీష్, సారిపల్లి శ్రీనివాసరావు, బుద్ద రాజు, బుద్ద భువనేశ్వరరావు, బుద్ద విశ్వనాథం, బుద్ద సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : కైలాసపట్నంలోని ఎస్సీ కాలనీలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని జరిపారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మితో పాటు దళిత నాయకులు పాల్గొన్నారు

కశింకోట : మండల కేంద్రం కశింకోట గుర్రం జాషువా కాలనీలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి జరిపారు. టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, సిద్దిరెడ్డి శ్రీను, తాకాశి కృష్ణ, కాండ్రేగుల సతీష్ తదితరులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సబ్బవరం: జగ్జీవన్‌రామ్ వర్ధంతిని అమరపినివానిపాలెంలో ఎంఆర్‌పీఎస్ నాయకుడు పెట్ల ఈశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వామిట్‌కుమార్, కోటి అప్పారావు, పెట్ల అప్పారావు, రాము, నాయుడు, కనకరాజు, ప్రకాశ్, అమ్మతల్లి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం పాయకరావుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రమందిర్ సెంటర్‌లో వీరాంజనేయ రిక్షా సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి దళిత నాయకులు సలికే గోవిందరావు, ఆరుగుల అప్పలకొండ, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు తుమ్మలపల్లి లక్ష్మణరావు, పట్టణ అధ్యక్షుడు ఇందుగపల్లి రమణ, తుమ్మలపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్ : మండలంలోని అరట్లకోటలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని టీడీపీ నాయకుడు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కుందూరు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, టీడీపీ నాయకులు కట్టా శ్రీను, తుమ్మల బాబ్జీ, కుందూరు అజయ్‌ప్రశాంత్, నందిక రవికుమార్, అనంతరపు రాజు, నందిక వినయ్‌కుమార్, ఆరుగుల జార్జి, జనసేన నాయకులు తుమ్మల గణష్, దొమ్మేటి చరణ్ పాల్గొన్నారు.

'జంతువుల నుంచి వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు అవసరం'



అనకాపల్లి గాంధీనగరంలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ ప్రసాదరావు



ఎలమంచిలి పట్టణంలోని పశువైద్య శాల ఆవరణలో టీకాలు

అనకాపల్లి టౌన్, జూలై 6 : జిల్లాలో పలుచోట్ల జూనోసిస్ డేను శనివారం నిర్వహించారు. ఇక్కడి గాంధీనగరం పశువైద్యశాలలో పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.సౌజన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 253 పెంపుడు కుక్కలకు ఉచితంగా నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భానుబాబు, రామారావు, చైతన్యమణి, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : కన్నూరుపాలెం, తాళ్లపాలెం, అచ్చెర్ల, తీడ గ్రామాల్లో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. పశు వైద్యాధికారులు అల్ఫోన్స్ జార్జ్, దయానా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, దొడ్డి నాగేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, జాన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పెంపుడు జంతువుల నుంచి వ్యాధులు సోకకుండా అంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం స్థానిక పశువైద్య శాలలో జూనోటిక్ వ్యాధులపై ఏర్పాటైన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పశువైద్య సిబ్బంది 250 కుక్కలకు టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ సునీల్ కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ జగదీష్, నాయకులు బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, మోటూరు శ్రీవేణి, కరెడ్ల ప్రకాష్, పవన్ విజయ్ పాల్గొన్నారు.

ఎలమంచిలి : జూనోసిస్ డే సందర్భంగా ఇక్కడి పశువైద్యశాల ఆవరణలో జంతువుల ద్వారా వ్యాప్తిచెందే జూనోసిస్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పశువైద్య శాఖ సహాయ సంచాలకులు గంగాధర్ పెంపుడు జంతువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 152 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్‌లు వేశారు. కొత్తపేట పాఠశాల విద్యార్థులకు జూనోటిక్ వ్యాధులు సోకకుండా జాగ్రతలు వివరించారు. ఎంఈవో మీనాక్షి, డాక్టర్ ప్రత్యూషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్ల : జంతువులను నుంచి సోకే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏడీ సింహాద్రిప్పడు అన్నారు జూనోసిస్ డే సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులకు జెనిటెక్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తంగేడు పశువుల ఆస్పత్రి డాక్టర్ ప్రతాప్‌కుమార్, గంటేడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఆరిపాక, సబ్బ వరం, రావలమ్మపాలెం, గుల్లేపల్లి పశు వైద్యశాలల్లో జూనోసిస్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీలు జరిపారు. ఎంఈవోలు లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ స్వర్ణలత, హెచ్ఎం తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



నక్కపల్లి, జూలై 6: ఉపమాక వేంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామున కొండపై ఉన్న స్వామి నిజరూపానికి పంచామృతాభిషేకం చేసిన అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. కింద ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవ మూర్తులను పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది.

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

ఎలమంచిలి, జూలై 6 : అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని లక్కవరం పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార యూనియన్ రాష్ట్ర ప్రతినిధి సోమేశ్వరరావు, లక్కవరం పీఏసీఎస్ సీఈవో శివరామకృష్ణ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలకు, రైతులకు సహకార సంఘాలు అన్ని విధాలా చేయూతనందిస్తున్నట్టు తెలిపారు. ఈ సేవలను రైతులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు సభ్య రైతులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పాయకరావుపేట రూరల్, జూలై 6 : కేశవరం, మంగవరం గ్రామాల శివారులో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్ఐ జోగారావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నామన్నారు.

10న కార్మిక వ్యతిరేక విధానాలపై ధర్నా

అనకాపల్లి టౌన్, జూలై 6 : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 10వ తేదీన ఆర్డీవో కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం జీవీఎంసీ జోనల్ ఒకటి, రెండు సర్కిళ్లలో కార్మికులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అజయ్, బాలారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'భవిత విద్యార్థులకు సొంత నిధులతో భోజనం'

అచ్యుతాపురం, జూలై 6 : భవిత సెంటర్‌లో ఉన్న దివ్యాంగ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రకటించారు. శనివారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పథకం అమలుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఆయన ఎంఈవో దేవరాయలును ఆదేశించారు. అలాగే, దివ్యాంగులను మనలో ఒకరిగా గుర్తించాలని, వారికి సదరం సర్టిఫికెట్లు వచ్చేలా ఆయా సర్పంచ్‌లు కృషిచేయాలని సూచించారు.

హైస్కూల్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈవో

నక్కపల్లి, జూలై 6 : ఉద్దండపురం జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం మధ్యాహ్నం జిల్లా ఉప విద్యా శాఖాధికారి పెన్నాడ అప్పారావు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. గత ఏడాది టెన్త్‌లో మంచి ఫలితాలు వచ్చాయని, ఈ ఏడాది కూడా ముందస్తు ప్రణాళిక ద్వారా పిల్లలను తీర్చిదిద్దాలని ఆదేశించారు.

సెల్ రీచార్జి ధరలు తగ్గించాలని ఆందోళన

ఎస్.రాయవరం, జూలై 6 : పెంచిన సెల్‌ఫోన్ల రీచార్జి ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అడ్డరోడ్డు జంక్షన్‌లో సీపీఎం మండల కన్వీనర్ మోర్త సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుత వినియోగదారులను ఆకట్టుకునేందుకు వివిధ రకాల ప్యాకేజీలను తక్కువ ధరలకు ఇచ్చి, వ్యాపారం అభివృద్ధి చెందాక ఆయా ప్రైవేటు టెలికాం కంపెనీలు చార్జీల భారాన్ని మోపుతున్నాయని ఆరోపించారు. ఇది సామాన్య, మధ్య తరగతికి భారంగా మారుతుందని, దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. సత్యనారాయణ, అప్పన్న, ఈశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న 8 మంది అరెస్టు

కశింకోట, జూలై 6 : మండలంలోని ఏఎస్‌పేట గ్రామ శివారున ఉన్న డ్యాం వద్ద కోడి పందాలు ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రమేష్‌బాబు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. నాలుగు కోడి పుంజులు పట్టుబడగా, వీటిలో రెండు చనిపోయాయని చెప్పారు. నిందితుల నుంచి నాలుగు వందల రూపాయలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కోటవురట్లలో జనసేన కార్యాలయం

కోటవురట్ల, జూలై 6: జనసేన కార్యాలయాన్ని శనివారం కోటవురట్లలో పార్టీ నియోజకవర్గ నేత గెడ్డం బుజ్జి తనయుడు ఆకాశ్ ప్రారంభించారు. నాయకులు తుమ్మలపల్లి స్వామినాథ్, రాము, దాసరి భాస్కరరావు, జర్రిపోతల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

సబ్బవరం, జూలై 6 : గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రైతులకు శనివారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. సర్పంచ్ బండారు మంగ, ఉప సర్పంచ్ గజ్జి దేముడుబాబు, బండారు శ్రీను, నర్సింగరావు, కార్యదర్శి బ్రహ్మా, పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

కశింకోట, జూలై 6 : మండల కేంద్రమైన కశింకోటలో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు ఎరువులు, పురుగులు, విత్తనాల దుకాణాల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బృందం అధికారి సీసీహెచ్‌వీ చౌదరి, రంపచోడవరం ఏడీఏ ఎ.రవి, విశాఖపట్నం ఐటీబీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

'వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించాలి'

అనకాపల్లి టౌన్, జూలై 6 : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఈనెల ఎనిమిదో తేదీన ఘనంగా నిర్వహించాలని వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. శనివారం రింగురోడ్డులోని పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, ఆళ్ల నాగేశ్వరరావు, కెఎం నాయుడు, ఎం.శోభ తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై విద్యార్థులు అవగాహన ర్యాలీ

పరవాడ, జూలై 6 : అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ పరవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం ఇక్కడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి జయశ్రీ కరిష్మా, సీహెచ్‌ఓ ఎంఎస్ఎస్ సాయిరాం, సీహెచ్ఎన్ జానకిరామన్, హెల్త్ సూపర్‌వైజర్ పీవీ రత్నం, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


నర్సీపట్నంలో కుక్కలకు టీకాలు వేస్తున్న సిబ్బంది


బుచ్చెయ్యపేట : వ్యాక్సిన్లు వేస్తున్న డాక్టర్ చిట్టినాయుడు


కె.కోటపాడులో వ్యాక్సిన్లు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తత అవసరం


రావికమతం పశు వైద్య కేంద్రం వద్ద..

▸ నిపుణుల సలహా ▸ జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

నర్సీపట్నం, జూలై 6 : జునోసిస్ డే సందర్భంగా సబ్ డివిజన్‌లో పెంపుడు కుక్కలకు వెయ్యి రేబీస్ టీకా డోసులు మంజూరు అయ్యాయని పశుసంవర్ధకశాఖ ఏడీ డబ్ల్యూ రాంబాబు తెలిపారు. శనివారం స్థానిక పశువుల ఏరియా ఆస్పత్రిలో జోనోసిస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం పశువుల ఏరియా ఆస్పత్రి, గొలుగొండ, కేడీపేట, చోద్యం, చెట్లుపల్లి పశువైద్య కేంద్రాలలో రేబీస్ టీకాలు వేయం జరుగుతుందని తెలిపారు. సబ్ డివిజన్‌కు మంజూరైన వెయ్యి రేబీస్ డోసులు అయిపోయే వరకు ఉచిత టీకా శిబిరం కొనసాగుతుందన్నారు. పశువుల నుంచి సక్రమించే వ్యాధులను జోనోటిక్ వ్యాధులు అంటారని తెలిపారు. కుక్క కరిసిన తర్వాత యాంటీ రేబీస్ వ్యాక్సిన్ ఐదు డోసులు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. వారం నుంచి నాలుగేళ్ల లోపు ఎప్పుడైనా రేబీస్ వ్యాధి బయపడే అవకాశం ఉందని, నిర్లక్ష్యం చేసే ప్రాణాలకు ప్రమాదమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెటుపల్లి, గొలుగొండ, చోద్యం, కృష్ణాదేవిపేట పశు వైద్యం కేంద్రాల అధికారులు డాక్టర్ కె.పుష్ప, డాక్టర్ ఎల్.రమేశ్, కె.రామ్మోహనరావు, డాక్టర్ జీవీహెచ్ శిరీషా పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట : పశువులు, పెంపుడు జంతువులను తాకిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని చోడవరం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టరు చిట్టినాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ జునోసిస్ డే సందర్భంగా శనివారం బుచ్చెయ్యపేట పశువైద్యశాలలో ఉచితంగా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాల అధికారిణి డాక్టరు ఉమామహేశ్వరీ, స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, నాయకులు పూడి రామారావు, వెటర్నరీ అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు, ఏహెచ్‌ఏలు సత్యనారాయణ, సీతారామ్, గోపాలమిత్ర జి.మణికంఠ పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

కె.కోటపాడు : స్థానిక పశువుల ఆస్పత్రిలో శనివారం కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు


దేవరాపల్లిలో కుక్కలకు వ్యాక్సిన్లు


రోలుగుంటలో అవగాహన ర్యాలీ..


చీడికాడ : గొప్పూరులో కుక్కలకు టీకాలు

వేశారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇ.దినేష్‌కుమార్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎస్కే సమీరా, ఆఫీస్ సబార్డినేట్ ఎన్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం : రావికమతం ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో వంద పెంపుడు కుక్కలకు శనివారం ఉచితంగా రేబిస్ టీకాలు వేసినట్టు ఏడీ టి.పుష్ప తెలిపారు. రెండు మండలాల పరిధిలో ఆరు పశువైద్య శాలల్లో ఉచిత రేబిస్ వ్యాక్సిన్లు వేశామన్నారు. రావికమతంలో 24, తట్టబంద 15, కొత్తకోట 25, రోలుగుంట మండలంలో రోలుగుంట 30, బుచ్చింపేట 20, కుసర్లపూడి 25, మొత్తం 139 పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్టు ఏడీ వెల్లడించారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు జి.లోకేష్, బాల తేజ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో..

చీడికాడ : మండలంలోని పెదగోగాడ పశువైద్య కేంద్రంలో కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేసే కార్యక్రమాన్ని తురువోలు ఎంపీటీసీ బీళ్ల కోటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ పైల అచ్చియ్యమ్మ ప్రారంభించారు. పశువైద్యాధికారి పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. జైతవరం పశువైద్య కేంద్రంలో సర్పంచ్ కోడూరు సత్యవతి ప్రారంభించగా, బైలపూడి, చీడికాడ, ఖండివరం, పశువైద్య కేంద్రాల్లో కూడా టీకాల కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పుట్టా మల్లికార్జునరావు, పశువైద్య సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, సీహెచ్ వర్మ, రాజేష్, అర్జున తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : స్థానిక పశు వైద్య కేంద్రంలో ఉచిత రేబిస్ వ్యాక్సిన్ వేసినట్లు పశు వైద్యాధికారి కె.మంజుషారాణి తెలిపారు. శాస్త్రవేత్త లూయిా పాశ్చర్ 1885న పిచ్చి కుక్క కాటుకు గురైన బాలుడుకు వేసిన టీకా విజయవంతం కావడంతో జునోసిస్ డే రోజైన జూలై 6న పెంపుడు శునకాలకు రేబిస్ టీకాలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సురేష, రమణమ్మ, నాగయ్యపేటలో అప్పారావు, మాధవి, రాంబాబు, సత్యవతి, పూర్ణిమ పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట : ప్రపంచ పశు సంక్రమిత వ్యాధుల నివారణ దినోత్సవం (వరల్డ్ జునోసిస్ డే) పురష్కరించుకుని రోలుగుంట పశువైద్య కేంద్రం వద్ద ఉచిత యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. స్థానిక జడ్పీ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రేబిస్ వ్యాధి నివారణపై రోలుగుంటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి నూకేశ్వరరావు, ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ, హెచ్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించండి

▸ నాన్-షెడ్యూల్ గిరిజన సంఘం

గొలుగొండ, జూలై 6 : మండలంలో బుడ్డపాడు గ్రామంలో ఉపాధి కూలీలకు ఎనిమిది వారాలుగా బకాయి ఉన్న మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని కోరుతూ నాన్-షెడ్యూల్ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.శివ డిమాండ్ చేశారు. శనివారం బుడ్డపాడులో కూలీలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ కూలీపై ఆధారపడిన కార్మికులకు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సెగ్గె రామకృష్ణ, లక్ష్మి, పోతురాజు పాల్గొన్నారు.

గొప్పూరులో వైద్య శిబిరం

చీడికాడ, జూలై 6 : గిరిజన గ్రామాల్లో ప్రాణాంతకమైన అతిసార, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధుల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని చీడికాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడులు కోరారు. వీరభద్రునిపేట శివారు గొప్పూరు గిరిజన గ్రామంలో శనివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

ప్రజల రుణం తీర్చుకోలేను.

పిల్లలను బాగా చదివించండి

పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చామనేదానికంటే, ఎంత బాగా చదివించామనే అంశానికే తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత కాలంలో పిల్లలు చదువుకోవడానికి ఎటువంటి ఇబ్బందులు వుండవు. మా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తూ, సహకారమందిస్తుంది. ఇదే సమయంలో యువత డ్రగ్స్ చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు సున్నితంగా ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ వుండాలి. ఒకసారి డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే ఎంత చదువుకున్నా వారి జీవితం నాశనమవుతుంది.

బెయిల్‌పై వచ్చి చంపేశాడు

... 5వ పేజీ తరువాయి

సీఐలు నరసింగరావు, బుచ్చిరాజు సిబ్బందితో వచ్చి బాలిక మృతదేహాన్ని పరిశీలించి, విచారణ జరిపారు. క్లూస్ టీమ్ చేరుకుని వేలిముద్రలను సేకరించింది. సురేశ్‌పై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు.

విద్యార్థులకు నగదు, దుస్తులు పంపిణీ

నాతవరం, జూలై 6 : నాతవరం మండలం గుమ్మిడిగొండలో అంగన్వాడీ కార్యకర్త లగుడు ప్రభావతి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె తండ్రి లగుడు కన్నయ్యనాయుడు టెన్త్ క్లాసులో మంచి మార్కులు సాధించిన 5 గురు విద్యార్థులకు 20 వేల రూపాయలు, అలాగే 5 గురు విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కన్నయ్యనాయుడు మాట్లాడుతూ తన కుమార్తె ప్రభావతి మంచి మార్కులు సాధించే విద్యార్థులనుఎప్పుడూ ప్రోత్సాహిస్తూ ఉండేదని ఆమె జ్ఞాపకార్థం తన వంతు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు.


మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న కన్నయ్యనాయుడు

ఈ కార్యక్రమంలో చింతకాయల ప్రశాంత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏ సమస్యనూ పట్టించుకోరే!

▸ అధికారుల తీరుపై గ్రామ సభలో కొత్తకోట గ్రామస్థుల అసంతృప్తి

రావికమతం, జూలై 6 : కొత్తకోట మేజరు పంచాయతీ గ్రామసభలో పలు సమస్యలను గ్రామస్థులు ఏకరువు పెట్టారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుందన్నారు. సర్పంచ్ కోన లోవరాజు అధ్యక్షతన శనివారం కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు.తాగునీటి సరఫరాలోనూ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని పూడి అప్పారావు, వార్డు మెంబరు బి. సత్యనారాయణ, బి.రాజారావు తదితరులు ఆరోపించారు. పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉందని, దీంతోదోమల బెడద ఎక్కువగా ఉందని జనసేన నాయకులు చింతల కిషోర్, ప్రజా సంఘం నాయకులు బి.బుల్లిబాబు, కె.మహేష్ తదితరులు పాలక వర్గం,అధికారులను నిలదీశారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని,కనీసం వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయలు నిర్వహణ సక్రమం లేదని నిలదీశారు.


మాట్లాడుతున్న సర్పంచ్ లోవరాజు

దీనిపై సర్పంచ్ లోవరాజు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై విద్యుత్ శాఖ ఉన్నదికారుల తెలియజేయడం జరిగిందన్నారు. ఇంటింటి కొళాయిలను అందరికి అందుబాటులోకి తేవాలని, కొళాయిల నీటిని మోటారులతో చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఈవో కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ పందల దేవా, కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'పేట'లో ఉపాధి నిధులు హాంఫట్

... 5వ పేజీ తరువాయి

ఆయా పంచాయతీల నాయకులు, గ్రామస్థులు మాట్లాడుతూ తమ పంచాయతీల్లో వీఆర్పీలు చేసిన అవకతవకలను డ్వామా పీడీకి వివరించారు. వీరిని విధుల నుంచి తొలగించడంతో పాటు స్వాహాచేసిన నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సందీప్ మాట్లాడుతూ నామవరం, ఈదటం వీఆర్పీలపై పూర్తిస్థాయి విచారణచేసి స్వాహా చేసిన నిధులు రికవరీ చేయడంతోపాటు వీరిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా ప్రజావేదికకు నామవరం వీఆర్పీ హాజరుకాకపోవడం పట్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవీఓ సీహెచ్.నిర్మలాదేవి, డీపీఎం పీవీ.రమణ, ఏపీడీ పీవీ.ఎరకయ్య, ఎంపీడీఓ కె.స్వప్న, మండల టీడీపీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వైసీపీ నాయకుడు ఇసరపు తాతారావు, టీడీపీ నాయకులు కురందాసు శివ, గొర్ల లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు జరుగుతుంటే చర్యలేవి?

పాయకరావుపేటలో జరిగిన ప్రజావేదికలో శ్రీరాంపురం పంచాయతీలో జరిగిన అవకతవకలపై చర్చ జరుగుతున్న సమయంలో పంచాయతీ సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతుంటే అధికారులు చర్యలు తీసుకోరా? అని ప్రశ్నించారు. శ్రీరాంపురం పంచాయతీలో గతంలో నిధులు స్వాహా చేసినట్టు నిర్ధారించి విధుల నుంచి తొలగించిన వీఆర్పీతో తిరిగి పంచాయతీలో ఉపాధి పనులు ఎలా చేయిస్తున్నారని, అదేవిధంగా అతడి నుంచి ఇప్పటి వరకు సొమ్ము ఎందుకు రికవరీ చేయలేకపోయారని నిలదీశారు. ఆయనతోపాటు నాయకులు బత్తిన నాగేశ్వరరావు తదితరులు కూడా అధికారులను నిలదీశారు. దీనిపై స్పందించిన డ్వామా పీడీ.. స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వహించకుండా చేసిన పనికిమాలిన పనులకు ప్రజల నుంచి తాము మాటలు పడాల్సి వస్తోందన్నారు. ఉద్యోగాల్లో ఉండాలనుకుంటే నిబంధనల ప్రకారం పనిచేయాలని పీడీ హెచ్చరించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను

▸ ఎమ్మెల్యే బండారు

మాడుగుల, జూలై 6 : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించే విషయంలో చర్యలు తీసుకుంటామని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. శనివారం మాడుగుల బస్టాండ్ దేవి ఆడిటోరియంలో బండారుకు దివ్యాంగులు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.3 వేలు అందుకుంటున్న దివ్యాంగులకు చంద్రబాబునాయుడు మరో మూడు వేలు పెంచి రూ.ఆరు వేలు అందించడం గొప్ప విషయమని అన్నారు. అంతేకాకుండా కిడ్నీ శస్త్రచికిత్స చేయించుకొని ఆస్పత్రులకు తిరుగుతున్న వారికి ఒక్కసారిగా రూ.5 వేలు పెంచి రూ.10 వేలు అందించడం, శాశ్వతంగా మంచాన పడిన బాధితులకు రూ.15 వేలు పింఛన్ అందించడం సంచలన నిర్ణయాలన్నారు. అనంతరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు


హాజరైన దివ్యాంగులు

మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ 75 రూపాయల పింఛన్‌ని ఏక కాలంలో రెండువేల రూపాయలకు పెంచి అందించిన ఘనత టీడీపీదేనని అన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఫించన్లు ప్రవేశపెట్టింది టీడీపీయే అన్నారు. అంతకు ముందు బండారు సత్యనారాయణమూర్తి, గవిరెడ్డి రామానాయుడులను దివ్యాంగులు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల పార్టీ కార్యదర్శి ఉండూరు దేముడు, టౌన్‌పార్టీ అధ్యక్షులు వద్దాది రంజిత్‌వర్మ, లెక్కల కాశిబాబు, జనసేన నాయకులు రొబ్బ మహేష్, ఇళ్లపు రమేష్, ఎంపీడీవో కాశీప్రసాద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్

▸ ఎమ్మెల్యే రాజుకు జిల్లా చెవిటి, మూగ దివ్యాంగుల సంఘం వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సంఘ సభ్యులు

చోడవరం, జూలై 6 : వినికిడి లోపాలున్న దివ్యాంగులకు ప్రభు త్వ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలని జిల్లా చెవిటి,మూగ దివ్యాంగుల సంఘం సభ్యులుశనివారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ ఎన్ఎస్ రాజుకు విజ్ఞప్తి చేశారు. వినికిడి లోపం ఉన్న వికలాంగులకు ప్రత్యేకంగా పాఠశాలల, కళాశాలలు ఏర్పాటుతో పాటు రాయితీపై రుణాలు అందించాలని కోరారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల మంజూరుతో పాటు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. వినికిడి లోపం ఉన్న వికలాంగులకు పింఛను అమలులో ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని, వికలాంగుల చట్టం 2016ను రాష్ట్రంలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను తాను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే రాజు హామీ ఇచ్చారు.

దాడులకు భయపడొద్దు.. అండగా ఉంటాం

▸ మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


విలేకరులతో మాట్లాడుతున్న ధర్మశ్రీ

చోడవరం, జూలై 6 : కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో రాష్ట్రంలో వైసీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడులకు దిగుతున్నారని, ఇది మంచి పరిణామం కాదని మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అన్నారు. వైసీపీ హయాంలో వేసిన శిలాఫలకాలు ధ్వంసం చేయడం దారుణమన్నారు. వైసీపీ కార్యకర్తలు దాడులతో భయపడవద్దన్నారు.కార్యకర్తలకు నాయకులకు తాము అండగాఉంటామని భరోసా ఇచ్చారు. అధికారం శాశ్వతం కాదని, ఈ రకమైన వైఖరి ఎవరు అనుసరించినా తప్పేనన్నారు. అధికార టీడీపీ కార్యకర్తలు రెచ్చగొట్టినా వైసీపీ కార్యకర్తలెవరూ రెచ్చిపోవద్దని, సంయమనం పాటించాలని సూచించారు. టీడీపీ నేతల దాడులపై చట్టపరంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.గ్రామాలకు అధికార పార్టీ ఎమ్మెల్యే వస్తే, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తే పాల్గొని గౌరవించాలని సూచించారు. చోడవరంలో రోడ్లు దారుణంగా ఉండడంతో ఆ ప్రభావం పడి తాను ఓటమి పాలయ్యానన్నారు. రోడ్ల బాగుకోసం తానెన్నో పోరాటాలు చేశానని, చివరకు సొంత డబ్బులతో గోతులు పూడ్చవలసి వచ్చిందన్నారు. టీడీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

8న రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు

ఈ నెల 8న దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వైసీపీ శ్రేణులకు ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపీపీ గాడి కాసు, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, పల్లా నరసింగరావు, బొడ్డేడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

118 మందికి వైద్య పరీక్షలు

కృష్ణాదేవిపేట, జూలై 6 : గొలుగొండ మండలం లింగంపేటలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి హరి ప్రవీణ్ 118 మంది రోగులను పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రజలకు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర వ్యాధులకు కారణమైన దోమలు, లార్వాపై అవగాహన కల్పించారు. ఎల్లవేళలా పరిసరాలు పరిశుభ్రతగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్యామ్‌కుమార్, వైద్య సిబ్బంది కృష్ణ, నూకరత్నం, ఆశ తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న హరిప్రవీణ్

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

చోడవరం, జూలై 6 : బాబూ జగజ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని శనివారం స్థానిక ఇందిరాకాలనీలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎలకా మల్లిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాజు, వెంకట కోటేశ్వరరావు, అప్పారావు, వరలక్ష్మి, స్థానిక యువకులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న స్థానికులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి : హెచ్ఎం అచ్యుతరామయ్య

మాకవరపాలెం, జూలై 6 : ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని మాకవరపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అచ్యుతరామయ్య అన్నారు. శనివారం హైస్కూల్ హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజరు లక్ష్మణ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పాఠశాల అవరణలో సుమారు పలు రకాలకు చెందిన 40 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

2 డిపోల్లో ఇసుక అమ్మకాలు

... 5వ పేజీ తరువాయి

సేకరణకు అనుమతులు ఇవ్వనున్నారు. దీంతో శారదా, తాండవ నదీ పరివాహక ప్రాంతాల్లో పేదల గృహాల నిర్మాణాలకు ఇసుక ఉచితంగా పొందే అవకాశం ఉంటుంది. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో స్థానిక అవసరాలకు అందుబాటులో వున్న నదుల్లో ఇసుక సేకరణకు పరిమిత అనుమతులు జారీ చేయనున్నారు. ఇసుక సేకరణ ఏయే ప్రాంతాల్లో చేయవచ్చనేదానిపై కమిటీ వివరాలను సేకరిస్తోంది. ఎంపిక చేసిన నదీపరివాహక ప్రాంతాల నుంచి స్థానిక అవసరాలకు కేవలం లోడింగ్, రవాణా చార్జీలు పెట్టుకుంటే ఇసుక పొందే అవకాశం ఉంటుంది. స్థానిక వీఆర్‌వో గృహ నిర్మాణదారులకు అవసరమైన ఇసుక నిల్వలు పొందేందుకు అనుమతులు జారీ చేయనున్నారు. గతంలో టైరు బండి ఇసుక రూ.700 వరకు చెల్లించాల్సి వచ్చేది. దూరాన్ని బట్టి రూ.1500 వరకు ధర పలికేది. ఉచిత ఇసుక పాలసీ అమలుతో ఇసుక లోడింగ్‌కు టన్నుకు రూ.30 మాత్రమే చెల్లించేలా ధర నిర్ణయించారు. రవాణా ఖర్చులు లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. టైరు బండి ఇసుక కేవలం రూ.500 ధర లోపే ఇంటికి చేరే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉచిత ఇసుక విధానం అమలుపై జిల్లా గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు మాట్లాడుతూ ఉచిత ఇసుక పంపిణీ అమలుకు అన్ని మండలాల్లో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నెల రోజుల వరకు డిపోల్లో ఇసుక ఆఫ్‌లైన్‌లోనే చెల్లింపులు జరుగుతాయన్నారు. డిపోల్లో ఇసుక నిల్వలు తరలిపోకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నెల రోజుల తరువాత ఆన్‌లైన్ బుకింగ్ విధానం అమలులోకి వస్తుందని చెప్పారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

▸ డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ


మధ్యాహ్న భోజన వంటశాలను తనిఖీ చేస్తున్న డీఈవో

రోలుగుంట, జూలై 6 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం మండలంలోని కుసర్లపూడి జడ్పీ పాఠశాలను సందర్శించారు. బోధన అందుతున్న తీరును పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులను సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని ఆదేశించారు. బడికొస్తా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విద్యార్థులకు సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో వెంకటేశ్వరరావు, ఎన్‌చార్జి హెచ్ఎం బి.విద్యావతి, అప్పన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు తలుపులమ్మ తల్లి పండుగ

రోలుగుంట, జూలై 6 : మండలంలోని లగుడుకొత్తూరులో ఆదివారం తలుపులమ్మ తల్లి పండుగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ లగుడు అప్పలనాయుడు తెలిపారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేఎస్ఎన్‌రాజు హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధర్నా విజయవంతం చేయండి

నర్సీపట్నం, జూలై 6 : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా ఈ నెల 10 సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ మిని స్టేడియంలో అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశ కార్యకర్తలతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు.

పాల సంఘాధ్యక్షుడుగా నర్సింగరావు


నర్సింగరావును సత్కరిస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట, జూలై 6 : నీలకంఠాపురం విశాఖ డెయిరీ పాల సంఘాధ్యక్షుడుగా పడాల నర్సింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పడాల అప్పారావు, చిన్నంనాయుడు, బూర సూర్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘాధ్యక్షుడుగా ఎన్నికైన నర్సింగరావుకు మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ శాలువా కప్పి అభినందించారు.

దాడి కేసులో ఐదుగురికి రిమాండ్

చీడికాడ, జూలై6 : మండలంలో అప్పలరాజుపురంలో గురువారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన ఘటనలో స్థానిక సర్పంచ్ చుక్క అప్పలనాయుడుతో పాటు మరో 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు స్థానిక ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు. ఈ కేసులో కురచా శ్రీను, బండారు బలరాం, మిడతాడ రామకృష్ణ, ఎం.అక్కునాయుడు, చుక్క జగదీష్‌లను చోడవరం కోర్టుకి పంపించగా, వారికి మెజిస్ట్రేట్ ఈ నెల 11వ తేదీ వరకు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు. నిందితులను అనకాపల్లి సబ్‌జైలుకు పంపించామన్నారు.

కాగా, సర్పంచ్ అప్పలనాయుడుతో పాటు మరో ముగ్గురిపైన దర్యాప్తు చేస్తున్నామని, దర్యాప్తు పూర్తయిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ శనివారం సాయంత్రం తెలిపారు.